# ఇండియా-బ్రెజిల్-దక్షిణాఫ్రికా ఫోరం... ఐబీఎస్ఏ!!

**అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై పరస్పర చర్చల కోసం.. భారత్, బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికా దేశాల చర్చా ఫోరం తెర పైకి వచ్చింది. ఈ దేశాలకు చెందిన విదేశాంగ మంత్రులు 2003, జూన్‌లో బ్రెజిల్ రాజధాని బ్రెసీలియాలో సమావేశ మై..."బ్రెసీలియా డిక్లరేషన్"ను విడుదల చేశారు. ఇండియా, బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికా చర్చా ఫోరం ఏర్పాటును ప్రకటించారు. మూడు ప్రాంతాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించడం... పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడం.. వ్యవ సాయం, ఇంధనం, వాణిజ్యం, టెక్నాలజీ వంటి రంగాల్లో సహకరించుకోవడం ఐబీఎస్ఏ ముఖ్య లక్ష్యాలు!!**

ఐబీఎస్ఏ తొలి త్రైపాక్షిక కమిషన్ సమావేశం భారత రాజధాని ఢిల్లీలో 2004, మార్చి 6న జరిగింది. ఫోరంలోకి కొత్తగా ఎవరినీ చేర్చుకోరాదని ఈ సమావేశం నిర్ణయించింది. ఐబీఎస్ఏలో చేరేందుకు చైనా, రష్యా, ఈజిప్టు వంటి దేశాలు ఆసక్తి చూపుతుండటం విశేషం.

### ఫోరం ప్రాముఖ్యత :

ఐబీఎస్ఏ దక్షిణ-దక్షిణ ప్రాంత సహకార ఫోరం.. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) చర్చల సంద ర్భంగా పరస్పర సమన్వయం, పేదరిక నిర్మూలన, త్రైపాక్షిక వాణిజ్యాన్ని పటిష్టపరచుకోవడం, రక్షణ రంగం.. వంటి అంశాలపై సహకారాన్ని పెంపొందించుకోవడం.. ఐబీఎస్ఏ ప్రధాన లక్ష్యాలు. ఐబీఎస్ఏ కేవలం చర్చలకే పరిమితం కాదని... ఇది నిర్మాణాత్మక చర్యల కోసం ఉద్దేశించిందని దక్షిణ ఆఫ్రికాకు చెందిన ప్రముఖ పత్రిక ఒకటి అభిప్రాయపడింది. కొనుగోలు శక్తి (పర్చేజింగ్ పవర్ పారిటీ-పీపీపీ) ప్రకారం... భారత్, ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. భారతదేశం మొత్తం జీడీపీ 2.93 ట్రి లియన్ల డాలర్లు. అదేవిధంగా బ్రెజిల్ మొత్తం జీడీపీ 1.27 ట్రిలియన్ల డాలర్లు. ఇది తొమ్మిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. 488 ట్రిలియన్ల డాలర్ల జీడీపీతో దక్షిణ ఆఫ్రికా 17వ స్థానంలో ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి పరంగా చూసినప్పుడు... బ్రెజిల్ 11వ, భారత్ 13వ, దక్షిణ ఆఫ్రికా 37వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు. వ్యవ సాయ రంగంలోనూ భారత్, బ్రెజిల్‌లది అత్యున్నత స్థానమే! మూడు ఆర్థిక వ్యవస్థలు పరస్పర పూర కాలు. ఐబీఎస్ఏకు చెందిన మూడు దేశాలు కూడా.. తమ తమ ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు. అంటే... ఐబీఎస్ఏ, మూడు ఖండాలకు చెందిన మూడు పెద్ద దేశాల చర్చావే దిక.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో.. భారత్, బ్రెజిల్‌లకు శాశ్వత సభ్యత్వానికి దక్షిణ ఆఫ్రికా గట్టి మద్దతు తెలుపుతుందని ఆ దేశం ప్రకటించింది. రక్షణ సహకారం ఐబీఎస్ఏ అజెండాలో ముఖ్యాంశం. ఆ మేరకు మూడు దేశాల విదేశాంగ మంత్రుల త్రైపాక్షిక కమిషన్.. 2004, మార్చిలో ఢిల్లీలో ''చర్యా ప్రణా ళిక''(ప్లాన్ ఆఫ్ యాక్షన్)ను విడుదల చేసింది. పరస్పర రక్షణ సహకారం ఎంతో ఉపయుక్తమని మూడు దేశాల విదేశాంగ మంత్రులు అభిప్రాయపడ్డారు. తమ రక్షణ రంగ పరిశ్రమలు బహుముఖ సమర్థత

సాధించాయన్నారు. ఇది రక్షణ రంగ ఉత్పత్తులు, వాణిజ్యంతోపాటు సంయుక్త మార్కెటింగ్‌కు కూడా దోహదం చేస్తుందని తెలిపారు. అంతర్జాతీయ భద్రత కోసం మూడు దేశాలు... వైమానిక, నౌకా రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని విదేశాంగ మంత్రులు నిర్దేశించారు. దాంతోపాటు అట్లాంటిక్, హిందూ మహాసముద్ర ప్రాంతంలో మాదక ద్రవ్యాల అక్రమరవాణాను అరికట్టేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఐబీఎస్ఏ సహకరించుకోవాల్సిన వాటిలో.. ఇంధన భద్రత మరో కీలక రంగమని నిపుణులు పేర్కొంటున్నారు. ఇథనాల్ వినియోగంలో ప్రపంచంలోనే బ్రెజిల్ ముందువరసలో ఉంది. దక్షిణ ఆఫ్రికా.. కోల్ గాసిఫికేషన్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. పవన, సోలార్ ఇంధన వినియోగానికి సంబంధించిన టెక్నాలజీలో భారత్ నైపుణ్యం సాధిస్తోంది. కాబట్టి, ఐబీఎస్ఏ తమ దేశాల ప్రగతి పథానికి ఈ సామర్థ్యాలను సమర్థంగా వినియోగించుకోవచ్చు.

### తొలి సదస్సు :

ఐబీఎస్ఏ తొలి సదస్సు బ్రెజిల్ రాజధాని బ్రెసీలియాలో 2006, సెప్టెంబరులో జరిగింది. భారత్ తరఫున ఈ సదస్సుకు ప్రధాని మన్మోహన్ సింగ్ హాజరయ్యారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా, దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు థాబో ఎంబెకీ కూడా సదస్సుకు వచ్చారు. బ్రెసీలియా సదస్సు చారిత్రకమైందని భారత ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు.

### మలి సదస్సు :

ఐబీఎస్ఏ రెండో సదస్సు.. దక్షిణ ఆఫ్రికాలోని త్స్వానేలో 2007, అక్టోబర్‌లో జరిగింది. సదస్సు సందర్భంగా.. త్స్వానే డిక్లరేషన్ వెలువడింది. ఐక్యరాజ్యసమితిలో సమగ్ర సంస్కరణలు అమలు చేయకుండా... అర్థవంతమైన అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పాటు చేయడం సాధ్యంకాదని ఆ డిక్లరేషన్‌లో ఉద్ఘాటించారు. భద్రతా మండలిని విస్తరించడంతోపాటు ఐరాసలో సంస్కరణలకు ఐబీఎస్ఏ కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. సర్వప్రతినిధి సభ(జనరల్ అసెంబ్లీ) పునరుద్ధరణ దిశగా... సభ్యదేశాల మధ్య సమగ్ర చర్చలు అవసరమని పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించి దోహా రౌండ్ చర్చలు కీలక దశకు చేరుకుంటున్నాయని డిక్లరేషన్ అభిప్రాయపడింది. అభివృద్ధి చెందిన దేశాలు తమ సబ్సిడీలను గణనీయంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచించింది. దోహా రౌండ్ చర్చలు విజయవంతమయ్యేలా కృషి చేయనున్నట్లు మూడు దేశాల నేతలు మన్మోహన్, సిల్వా, ఎంబెకీ ప్రకటించారు. త్రైపాక్షిక వాణిజ్యం దిశగా ఇంకా ప్రగతి సాధించాల్సి ఉందని ముగ్గురు నేతలు అభిప్రాయపడ్డారు. భారత్, బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగాల్సిన అవసరముందన్నారు. త్రైపాక్షిక వాణిజ్య లక్ష్యం 2010 నాటికల్లా 15 బిలియన్ డాలర్లుగా నిర్దేశించారు. ప్రపంచ శాంతికి, అంతర్జాతీయ భద్రతకు ఉగ్రవాదం పెను సవాలుగా మారిందని ఐబీఎస్ఏ డిక్లరేషన్ పేర్కొంది. ఉగ్రవాద భూతాన్ని తుదముట్టించేందుకు సంయుక్తంగా చర్యలు చేపట్టాలంది. మూడు దేశాల మధ్య

సామాజిక- ఆర్థిక రంగాల్లో ఉమ్మడి అంశాలను గుర్తించి.. ఏవైనా లోపాలుంటే సరిదిద్దుకునే విషయంపై ఐబీఎస్ఏ డిక్లరేషన్ దృష్టిసారించింది. రెండో సదస్సు సందర్భంగా.. వాణిజ్య, సామాజిక ప్రగతికి సంబంధించి భారత్, బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికా.. ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ దేశాల్లోని పేదల జీవన స్థితిగతులు మెరుగుపరచడంలో ఈ ఒప్పందాలు దోహదపడతాయి.

## మూడో సదస్సు ఢిల్లీలో :

ఐబీఎస్ఏ మూడో సదస్సు అక్టోబరు 15, 2008న ఢిల్లీలో జరిగింది. దీనికి భారత ప్రధాని మన్మోహన్ సింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులాడా సిల్వా, దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు గ్లామా పెట్రస్ మొట్లాంతె హాజరయ్యారు. గ్లోబల్ గవర్నెన్స్‌తోపాటు ప్రాంతీయ అంశాలపై 50 పాయింట్ల డిక్లరేషన్‌ను సదస్సు ప్రకటించింది. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం.. ఇంధనం, ఆహార ధరల పెరుగుదల.. వంటి అంశాలపై పూర్తి సమన్వయ సహకారాలతో పనిచేయాలని మూడు దేశాల నేతలు నిర్ణయించారు. ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు వీలుగా ఒక సంయుక్త సమన్వయ భేటీని నిర్వహించాల్సిందిగా.. తమ తమ ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్లను ఆదేశించాలని కూడా అంగీకారానికి వచ్చారు.

ఐక్యరాజ్యసమితి, జీ-8 వంటి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరాన్ని భారత ప్రధాని మన్మోహన్ సింగ్ నొక్కిచెప్పారు. అంతర్జాతీయ వాణిజ్య సంస్థ, దోహా రౌండ్ చర్చలను ఫలప్రదంగా ముగించాలనే ఆకాంక్షను ఆయన వ్యక్తంచేశారు. వ్యవసాయ రంగంలో ఐబీఎస్ఏ దేశాలు సహకరించుకునే అంశంపై ఒక పత్రాన్ని విడుదల చేశారు. ఆహార భద్రతకు సంబంధించి కూడా ఈ పత్రంలో కొన్ని సూచనలు చేశారు. ఇంధనం, వ్యవసాయ రంగాలకు సంబంధించి సదస్సులో నేతలు జరిపిన చర్చలను ఆయా అంశాలపై ఏర్పాటైన వర్కింగ్ గ్రూప్‌లు మరింత ముందుకు తీసుకెళ్తాయి. పౌర అణు సహకారానికి సంబంధించి మద్దతు తెలిపినందుకు బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికాలకు మన్మోహన్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇంధన అవసరాలపై కూడా సదస్సులో చర్చ జరిగింది. భారత్‌కే పరిమితమైన పౌర అణు భద్రతాంశాలకు ఆమోదం తెలుపుతూ.. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) తీసుకున్న ఏకాభిప్రాయ నిర్ణయాన్ని ఐబీఎస్ఏ సదస్సు స్వాగతించింది. వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించి భారత్, బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికాల మధ్య సంబంధాలు వేగవంతమవుతున్నాయని మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో.. మార్కెట్లకు సంబంధించి పరస్పరం ప్రయోజనం చేకూర్చే అంశాలపై మూడు దేశాలు దృష్టిసారించాలన్నారు. 2015 నాటికల్లా త్రైపాక్షిక వాణిజ్యం లక్ష్యం 25 బిలియన్ల డాలర్లుగా నిర్దేశించారు. వాణిజ్య అవకాశాలను పరిశీలించి, వాణిజ్యాన్ని పెంపొందించుకునే దిశగా ప్రయత్నించాల్సిందిగా మూడు దేశాల్లోని సంబంధిత ఆర్థిక సంస్థలను నిర్దేశించాలని నిర్ణయించారు. మూడో సదస్సు ఫలితాలపై నేతలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. నాలుగో సదస్సు 2009, అక్టోబరు 8న బ్రెజిల్‌లో జరుగనుంది!!